క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ప్రభావతికి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: మున్సిపల్ పరిధి విఠాయిపల్లి గ్రామానికి చెందిన ప్రభావతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి పథకం కింద రూ.39 వేల చెక్కు మంజూరు అయింది. మాజీ సర్పంచ్ పర్వతాలు, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి శనివారం ఆమెకు చెక్కు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌నాయక్, కృష్ణ, రవీందర్, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం మండల పరిధి పలు గ్రామాల్లో పర్యటించనున్నారని కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం ప్రారంభించనున్నారని, అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కొత్తపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారని పేర్కొన్నారు.

కడ్తాల్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వాహకులు మెట్లూరి వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో విశ్వక్ సేనపూజ, అంకురార్పణ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు జీఎల్‌ఎన్ రెడ్డి, వేణుగోపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌ను సవరించాలి

యాచారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేద ప్రజలకు అన్యాయం చేసే విధంగా ఉందని, వెంటనే సవరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేవారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న నగరంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మంతన్‌గౌరెల్లి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలకు మేలు చేసే విధంగా ఉందని ఆరోపించారు. పద్దును సవరించాలని కోరారు. నాయకులు తావునాయక్, చందునాయక్, శ్రీరాములు, జంగయ్య ఉన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సమీక్ష నేడు

యాచారం: బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమీక్షకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డిలు హాజరవుతారని, మండల పరిధి పార్టీ శ్రేణులు అందరూ రావాలని ఆయన కోరారు.

నేడు పోచారంలో ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారు. ఎంపీపటేల్‌గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో పోచారంలో నిర్మించిన 2వేల మెట్రిక్ టన్నుల గోదాంను ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ జాతర ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం మాజీ కౌన్సిలర్ యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉత్సవాలకు రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మస్న రవికుమార్, నర్సింహ, యూసుఫ్ ఖాద్రీ, ముక్రం అలీ, కిశోర్, దిలీప్ గౌడ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు కసరత్తు

- వారంలో వెలువడనున్న షెడ్యూల్
- నేతల్లో చిగురించిన ఆశలు
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 14 గ్రామాల్లో ఎన్నికలు

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక ఎన్నికల నిర్వహణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మరో వారం రోజుల్లో షెడ్యూల్ వెలువడే సూచనలు రావడంతో స్థానిక నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బరిలో దిగేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. బడా నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇప్పటికే ఆయా నేతల కనుసైగల్లో ఉన్నప్పటికీ.. షెడ్యూల్ ప్రకటన రావడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. గత పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది పూర్తయింది. నాటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో తాజా సంకేతాలతో ఔత్సాహికులు గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. ఇక ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడమే ఆలస్యం. అయితే ముందుగా.. జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారా? పంచాయతీ పోరుకు వెళ్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.



ఎదురు తెన్నులు

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నేతలకు రిజర్వేషన్ గుబులు పట్టుకుంది. తమ గ్రామంలో రిజర్వేషన్ ఎలా ఉండబోతోందన్న ఆతృతతో ఎదురు చూస్తున్నారు. ఇదే అంశంపై పలువురు అధికారులను అడిగి.. తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో నాలుగు గ్రామాలు సమీప పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామాల్లోని రెండు పంచాయతీల్లో గతంలో ఎస్సీ రిజర్వు అయిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు స్థానాలను ప్రస్తుతం మిగిలి ఉన్న 14 పంచాయతీల్లోని ఏ గ్రామంలో రిజర్వు చేస్తారనే సందేహంలో నేతలు ఉన్నారు. అటు రిజర్వేషన్లు ఫైనల్ కాకపోవడంతో.. ఒక వైపు రిజర్వేషన్ల కోసం, మరో వైపు ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు జారీ చేస్తుందోనని నేతలు ఎదురు చూస్తున్నారు.

ఆ గ్రామాల్లో పోరు

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి 14 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 18 గ్రామాలకు గాను 4 పంచాయతీలను పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. మండలంలో ప్రస్తుతం 14 గ్రామాలే ఉన్నాయి. అయితే మున్సిపాలిటీలో నాలుగు గ్రామాలను విలీనం చేసిన సమయంలో.. మిగతా 14 గ్రామాల్లోని కొన్నింటిని కలిపి నగర పంచాయతీగా మార్పు చేస్తారన్న ప్రచారం జరిగింది. అయితే తాజాగా ఎంపీటీసీ స్థానాల కోసం అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెల్లడించడంతో.. 14 గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని జిల్లా స్థాయి అధికారి ఒకరు పేర్కొన్నారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక భారతి సిమెంట్

సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: నిర్మాణ రంగంలో భారతి సిమెంటుకు తిరుగులేదని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ తెలిపారు. తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న సంస్థ.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి ముత్యం సిమెంట్, స్టీల్స్ డీలర్ దుకాణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాపీ మేస్త్రీలతో బద్రీ మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక న్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్స్ మల్లికార్జున్ రెడ్డి, రవి, అనీల్‌రెడ్డిలు మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉందన్నారు. సమావేశంలో సంస్థ మార్కెటింగ్ విభాగం డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, 60మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలతో మాట్లాడుతున్న ఇంజినీర్ బద్రీ

బడ్జెట్‌ను సవరించాలి

యాచారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేద ప్రజలకు అన్యాయం చేసే విధంగా ఉందని, వెంటనే సవరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేవారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న నగరంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మంతన్‌గౌరెల్లి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలకు మేలు చేసే విధంగా ఉందని ఆరోపించారు. పద్దును సవరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తావునాయక్, చందునాయక్, శ్రీరాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహేశ్

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, స్నేహభావంతో ఆడి, క్రీడాస్ఫూర్తిని నింపాలని సూచించారు. అంతకు ముందు క్రీడాకారులకు డ్రెస్సులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎనుమల రమేశ్, పవన్‌కుమార్, మహేందర్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఆర్గనైజర్లు జగన్, మనోహర్‌రెడ్డి, రాజు, రవి, చాంద్‌పాష, సురేశ్, పవన్, గోపి, సందీప్, ఎంఈఓ పాండు, ఉపాధ్యాయులు దూసకంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన ధర్మకర్త గూడ యాదగిరి నృసింహశర్మ, నిర్వాహకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీలు శ్రీనివాస్ యాదవ్, నిర్మల, మాజీ సర్పంచ్ సంగీత, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్, నాయకులు అంబాజి, విష్ణువర్ధన్ యాదవ్, నరేందర్‌గౌడ్, యాదయ్య, రాజుగుప్తా, మోహన్‌రెడ్డి, సంపత్, శ్రీశైలం, శేఖర్, ఆంజనేయులు, లింగం తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న భక్తులు

నేటి నుంచి వేణుగోపాల స్వామి జాతర

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలి రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు కలశ స్థాపన అంకురార్పణ, సాయంత్రం 5 గంటలకు అధివాస హోమం నిర్వహించనున్నారు. రోజువారి వివరాలు ఇలా ఉన్నాయి. 10న ఉదయం 7.45 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి హోమం. మంగళవారం రాత్రి 8.30 గంటలకు స్వామి వారి కల్యాణం. 12న హోమం, 13న ఉదయం 6.30 గంటలకు స్వామివారి రథోత్సవం. 14న ఉదయం 7.30 గంటలకు హోమం, సాయంత్రం 5.30 గంటలకు నాగవల్లి కార్యక్రమం. రథోత్సవం రోజున స్వామివారి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి పాటలు, కోలాట ఆటలు ప్రదర్శించనున్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో శనివారం రూ.35 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్లకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాలతో తెలంగాణలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తుందని స్పష్టంచేశారు. ప్రజలు అధికార పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు వెంకటేశ్, నరేశ్‌నాయక్, చందోజీ, బిక్యానాయక్, శంకర్, రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇటీవల పాత్రికేయుడు మల్లేశ్ తల్లి యాదమ్మ మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

రోడ్డు విస్తరణ పూర్తిచేయాలి

ఆమనగల్లు పట్టణం రాజీవ్‌చౌరస్తా నుంచి చందబావి వరకు అసంపూర్తి రోడ్డు విస్తరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశించారు. విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న పోలీస్ స్టేషన్ ప్రహరిని కూల్చి, కొత్తగా నిర్మాణం చేపడతామని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అంతకు ముందు రోడ్డు విస్తరణ పనులతో పాటు ట్రామా కేంద్రం, స్కిల్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రవీందర్, ఏఈ రవితేజ, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్, సీఐ ప్రమోద్‌కుమార్, మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు కండె రంగయ్య, వస్పుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం

ఆమనగల్లు: సమాజ సేవే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని సాలార్‌పూర్, నార్లకుంటతండా, కరాయితండా, చెన్నారం, చల్లంపల్లి, కడ్తాల్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ట్రస్ట్ తరఫున రూ.75 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, ప్రియ, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, పూజ, నరేందర్‌నాయక్, కృష్ణయ్య, నాయకులు రమేశ్, సాయిలు, దేవ, రాంచందర్, బాబా, జంగయ్య, రమేశ్, శ్రీను, గోపాల్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకటాద్రిగా పిలువబడే ఈ కొండపై ఉన్న విశాలమైన స్థలంలో ఆలయాన్ని నిర్మించి, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ యాదిరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- అవినీతి పార్టీలకు ఢిల్లీలో చుక్కెదురు
- కమలానికి పట్టం కట్టిన హస్తిన వాసులు: బీజేపీ
- కాషాయ నేతల సంబురాలు

ఆమనగల్లు: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారం కైవసం చేసుకోవడంతో పట్టణంలోని జాతీయ రహదారిపై శనివారం కమలనాథులు సంబురాలు చేసుకున్నారు. భారీగా బాణాసంచాలు కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల్లో హస్తిన ప్రజలు.. అవినీతి పార్టీలైన కాంగ్రెస్, ఆప్‌లను తిరస్కరించి, బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆచారి అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాంపాల్‌నాయక్, లక్ష్మణ్, నర్సింహ, కృష్ణనాయక్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేత ఆచారి

కడ్తాల్‌లో..

ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో కడ్తాల్ మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, మాజీ అధ్యక్షుడు మన్య నాయక్, నాయకులు భగీరథ్, సాయిలాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాందాస్ పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. స్థానిక కూడలిలో బాణాసంచాలు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు సునిల్, అశోక్ హరీశ్, భూపేష్, కష్ణ, శ్రీనివాస్, యాదయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బొంగ్లూర్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ జెండా ఎగరడం చాలా సంతోషంగా ఉందని ఆ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు గజ్జెల నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హస్తినలో ఆ పార్టీ అధికారం కైవసం చేసుకోవడంతో బొంగ్లూర్ గేటు వద్ద కమలనాథులు విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌లాల్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాడ్గులలో



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ గేటు వద్ద..

అపార్‌కు ఆధార్ కష్టాలు

- ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు
- వన్‌నేషన్, వన్‌ఐడీని ప్రవేశ పెట్టిన కేంద్రం
- నమోదు కాని ఆధార్ వివరాలు

తుక్కుగూడ: ఆధార్ కార్డు తరహాలో ఒకే నంబర్‌తో అపార్ కార్డును కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోంది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారందరికీ శాశ్వత సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వనుంది. ప్రస్తుత ఆధార్ తరహాలో వన్ నేషన్– వన్ ఐడీ పేరుతో 17 అంకెల గల అపార్ కార్డును అందుబాటులోకి కేంద్రం తీసుకురానుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి విద్యా సంస్థలో అపార్ నమోదు ప్రక్రియను గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. అపార్ నంబర్ కోసం ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎంకు దరఖాస్తు చేసుకోవాలి. కానీ జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌లోని కొన్ని వివరాలకు పొంతన లేకపోవడంతో విద్యార్థులు, వారి పెద్దలు మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మందకొడిగా ఆన్‌లైన్..

అపార్ నమోదును పాఠశాల యాజ్యమానం ఆన్‌లైన్‌లో యూడైస్‌లో విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలు తరగతి, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, తల్లిదండ్రులు తదితర వివరాలను నమోదు చేయాలి. అపార్ నంబర్‌ను విద్యార్థికి టీసీ ఇచ్చే సయమంలో రాయాలి. విద్యార్థులకు ఆధార్ కార్డులో పూర్తి వివరాలు లేక పోవడం, పుట్టిన తేదీ, ఇంటి పేరు పూర్తి స్థాయిలో లేక పోవడం, సరైన ఇంటి చిరునామ, తెలంగాణ రాష్ట్ర ఆధార్ కార్డు లేక పోవడంతో ఇలా ఏది తప్పు ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు.

55 శాతం పూర్తి

మహేశ్వరం మండలంలో 59 ప్రభుత్వ, 33 ప్రైవేటు విద్యాసంస్థల్లో 20,136 మంది చదువుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 11,267 మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 9,549 విద్యార్థుల వివరాలు.. ఆధార్‌లో తప్పులు, అడ్మిషన్ రికార్డులో తప్పులు తదితర కారణాలతో నమోదు కావడం లేదు. ఇప్పటి వరకు 55 శాతం మేరకు పూర్తి చేశారు.



ఇమామ్‌గూడ పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న ఉపాధ్యాయుడు

ఆధార్ కేంద్రాలకు పరుగు

ఆధార్ కార్డులో తప్పులు ఉండటం వలన విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు కావడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలను విడిచి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో పరిమితంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఉండటం, వాటి వద్ద జనాల సంఖ్య ఎక్కువగా ఉండటం వలన విద్యార్థులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రోజులు తరబడి, కష్టపడి ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకుంటున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

విద్యార్థుల ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లో వివరాల తప్పుల కారణంగా అపార్ ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. నిత్యం ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. మిగతా విద్యార్థులు తమ పత్రాలను సరి చేసుకుంటున్నారు. ఈ నెలాఖరు వరకు వంద శాతం ఆన్‌లైన్ చేస్తాం.

– కస్నా నాయక్, ఎంఈఓ, మహేశ్వరం